సాక్షి
చిత్తూరు

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



విరి'సిరి'గా..!

ఆరు పదుల వయస్సు దాటినా మదన్ అనే రైతుకు పూల సాగుపై మమకారం తీరలేదు..నేటికీ విరి సిరులు పండిస్తున్నారు. - 8లో



కూటమి పాలన..దివ్యాంగ వేదన

పింఛన్ల పంపిణీకి పునః పరీక్షల పేరుతో కూటమి సర్కారు దివ్యాంగుల సహనానికి పరీక్ష పెడుతోంది. - 8లో



పెళ్లి బాజా మోగింది!

మాఘమాసంలో ముహూర్తాలు ఉండడంతో జిల్లాలో పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా బాజా భజంత్రీలు మోగుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై జాగ్రత్తలు అవసరం

- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్, ఎస్పీ



అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సైబర్ మోసాల అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు తలెత్తితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. జాగ్రత్తలు పాటిస్తూ ఇంటర్నెట్ వినియోగించాలన్నారు. ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు కాల్స్‌లో వెల్లడించకూడదన్నారు. అనధికార ఆధార్ చెల్లింపు నోటిఫికేషన్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకేవైసీ అప్‌డేట్ పేరుతో పాన్, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలకు లింకులను క్లిక్ చేయమంటే చేయకూడదన్నారు. డిజిటల్ ఐడెంటిటీని ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఐఓ వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.34 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.1,34,68,278 ఆదాయం వచ్చిందని ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. వరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో హుండీలను మంగళవారం లెక్కించారు. ఉదయం ప్రారంభమైన లెక్కింపు మధ్యాహ్నం వరకు సాగింది. హుండీల ద్వారా ఆలయానికి రూ.1,34,68,278 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.9,687, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.45,694, ప్రచార రథం రూ.5,318 వచ్చిందన్నారు. మిగిలిన మొత్తం ప్రధాన హుండీ ద్వారా వచ్చిందన్నారు. యూఎస్ ఏవీ 183 డాలర్లు, యూఏఈ 355 దిర్హామ్స్, ఇంగ్లాడ్‌వి 70 పౌండ్స్, యూరప్‌వి 25 యూరోలు, కెనడావి 15 డాలర్లు, ఆస్ట్రేలియావి 20డాలర్లు, మలేషియావి 365 రింగిట్స్ వచ్చాయన్నారు. బంగారం 44 గ్రాములు, వెండి 1.5 కిలోలు వచ్చిందన్నారు. ఏఈఓ లు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ పాల్గొన్నారు.

కూటమి మాటలకెన్నో అర్థాలున్నాయి.. నోటి నిండా అబద్ధాలే ఉంటాయి..ఎండమావులెలా దప్పిక తీర్చవో.. కూటమి హామీలు కూడా అలాగే మారిపోయాయి. సూపర్ సిక్స్ పేరుతో 'మాయ'ఫెస్టో తీసుకొచ్చి.. హామీల వర్షం కురిపించి, ఓట్లు దండుకుని గద్దెనెక్కింది. కూటమి ప్రతి విషయంలోనూ ప్రజల నెత్తిన టోపీ పెట్టి పథకాలు ఎగ్గొట్టేందుకు సిద్ధమైంది. అందుకే సర్వేలకు శ్రీకారం చుట్టింది. పింఛన్లు మొదలు రేషన్ వరకు అన్నింటిలోనూ కోతలు పడతాయేమో ఈ సర్వేతో సర్వేశ్వరా అని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



కోతలకేనా సర్వేశ్వరా?

- టీడీపీ కూటమి ప్రభుత్వంలో సంక్షేమపాలన కనుమరుగు
- అమలుకు నోచుకోని సూపర్‌సిక్స్ పథకాలు
- వివిధ సర్వేల పేరుతో కాలయాపన
- సర్వేలు ఎవరి కోసమని ప్రశ్నిస్తున్న ప్రజలు
- జనాన్ని మోసం చేసేందుకు సర్వేలని ఆరోపణలు

జిల్లా సమాచారం

జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు	8,22
గ్రామ పంచాయతీలు	6,97
జిల్లా జనాభా	18.73 లక్షలు
పురుషులు	9.40 లక్షలు
మహిళలు	9.33 లక్షలు
అర్బన్ జనాభా	3.69 లక్షలు
రూరల్ జనాభా	15.04 లక్షలు
జిల్లాలోని గ్రామ సచివాలయాలు	504
వార్డు సచివాలయాలు	108
విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు	4,825

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పాలన కనుమరుగైంది. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావొస్తున్న ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. అయితే వివిధ సర్వేల పేరుతో ప్రజలను మోసం చేసే పనిలో టీడీపీ కూట మి నిమగ్నమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని గ్రామాల్లో సర్వేల కోసం వెళ్తున్న సిబ్బందిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉపయోగం లేని సర్వేలకు సహకరించేది లేదంటూ ప్రజలు తేల్చి చెబుతున్నారు.

సర్వేల సంప్రదాయానికి లేచిన తెర

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు నాలుగు రెవెన్యూ డివిజన్లు 32 మండలాలున్నాయి. రెవెన్యూ గ్రామాలు 822, గ్రామ పంచాయతీలు 697 ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటితోపాటు ఒక మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలున్నాయి. వీటన్నింటిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన్నప్పటి నుంచి వివిధ రకాల సర్వేలను చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4.56 లక్షల కుటుంబాల్లో 18.73 లక్షల జనాభాను సర్వేల పేరుతో భయాందోళనకు గురిచేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్వేల సంప్రదాయానికి కూటమి సర్కారు తెరలేపిందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

సంక్షేమపాలన కనుమరుగు

జిల్లా వ్యాప్తంగా కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పాలన పూర్తిగా కనుమరుగైందని ప్రజలు వాపోతున్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేకపోవడంతో సర్వేలకు ప్రాధాన్యతనిస్తున్నారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పేద కుటుంబాలకు సర్వేల వల్ల ఎలాంటి లాభం లేదని చెబుతున్నారు. సంక్షేమ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని అడుగుతున్నందుకు చంద్రబాబు సర్వేలకు శ్రీకారం చుట్టారని ప్రజలు విమర్శిస్తున్నారు.

సర్వేల్లో సచివాలయ ఉద్యోగులు తలమునకలు

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్వేలకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు ఆ పనుల్లో తలమునకలై ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా హౌస్ హోల్డ్, ప్యాక్స్ (సహకార సంఘాలు) ఈకేవైసీ, మిస్సింగ్ సిటిజన్, జియో ట్యాగింగ్, గ్రామ పంచాయతీ ఆస్తుల వివరాలు, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఇండియా), పింఛన్ లబ్ధిదారుల పరిశీలన, క్యాన్సర్ సర్వే, 18 ఏళ్ల వయస్సు పైబడిన వివరాలు సేకరణ, హౌసింగ్ డిమాండ్ సర్వే, ఎంఎస్ఎంఈ, నాన్‌రెసిడెంట్ఏపీ సిటిజన్ తదితర సర్వేలు నిర్వహిస్తున్నారు. సర్వేలతో ఎలాంటి పారదర్శకత లేకపోయినా చేయాల్సిందేనంటూ సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. జిల్లాలోని గ్రామాల్లో సర్వేల కోసం ప్రజలకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు చేదు అనుభవం ఎదురవుతోంది. సర్వేలకు ఓటీపీలు చెప్పేది లేదంటూ ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు.

పథకాల కోసం ప్రదక్షిణలు

జిల్లా వ్యాప్తంగా సంక్షేమ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ పాలనలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం అన్ని పథకాలను అమలు చేసి చూపించారు. ప్రజలు కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండానే సంక్షేమ పథకాలను అమలు చేశారు. ప్రజల ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల పొందిన లబ్ధిదారులు గత ఐదేళ్లు ఆర్థికంగా అభివృద్ధికి నోచుకున్నారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల హామీలు అమలు చేయడంలో విఫలమైంది. దీంతో ప్రజలు నిత్యం సంక్షేమ పథకాల లబ్ధి కోసం కలెక్టరేట్, ఎంపీడీఓ, తహసీల్దార్, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి, విసిగి వేశారిపోతున్నారు. అయినా ఫలితం మాత్రం దక్కలేదు.

జనానికి ఒరిగిందేమి లేదు



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటింటికీ వచ్చి రకరకాల సర్వేలు చేపడుతోంది. కానీ ఏ ఒక్క పథకమూ కార్యరూపం మాత్రం దాల్చలేదు. కానీ నిత్యం మీ ప్రభుత్వం పని తీరు బాగుందా? ఎమ్మెల్యే అందుబాటులో ఉన్నాడా? అంటు రకరాల ఫోన్లు చేసి విసిగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సామాన్యులు లాభపడే పథకం ఒక్కటంటే ఒకటి కూడా రాలేదు.

– అజయ్, వ్యాపారి, కుప్పం

కాలయాపన చేస్తున్నారు



ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామంటూ నమ్మబలికారు. అధికారంలోకి వచ్చి 7 నెలలైనా ఇంత వరకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. పైగా పంటల బీమా మొత్తాన్ని రైతులే చెల్లించాలంటూ చావు కబురు చల్లగా చెప్పారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. ఇప్పుడేమో మేలు చేసేలాగా సర్వేలు చేస్తున్నామని కాలయాపన చేస్తున్నారు.

– పెరుమాళ్, రైతు, తిమ్మాపురం, నగరి నియోజకవర్గం

సర్వేలతో అభివృద్ధి జరుగుతుందా?



కూటమి నిర్వహిస్తున్న సర్వేలతో అభివృద్ధి జరుగుతుందా? అని ప్రశ్నిస్తున్నాం. నిరుద్యోగులు, ప్రజలకు ఏమైనా మేలు జరుగుతుందా?.యువత ఉద్యోగాలు లేక తల్లడిల్లుతున్నారు. డీఎస్సీ ఇదిగో అదిగో అంటూ ఊరిస్తున్నారు. నిరుద్యోగ భృతి జాడేలేదు. అభివృద్ధి, సంక్షేమం చేయాల్సింది పోయి సర్వేలు చేసుకుంటున్నారు.

– సాయి, ఎం పైపల్లి, తవణంపల్లి మండలం, పూతలపట్టు నియోజకవర్గం

కూటమి కర్షకులను ముంచేస్తోంది



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్రంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: తెలుగుదేశం ప్రభుత్వం చెరువులకు నీరు వదలకుండా నిర్లక్షం చేసి, రైతులను ముంచేసిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయాన్ని ఆయన పరిశీలించి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డితో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వరదనీటిని ఎప్పటికప్పుడు హంద్రీనీవా కాలువలకు విడుదల చేసి, వాటిని కుప్పం వరకు తరలించే కార్యక్రమం చేపట్టి, రైతాంగాన్ని ఆదుకుని, వ్యవసాయం చేసేందుకు దోహదం చేసిందని తెలిపారు. గత ప్రభుత్వంలో చెరువులు ఎండలేదన్నారు. ప్రస్తుతం కూటమి సర్కారులో హంద్రీనీవా కాలువలకు నీటిని వదలకపోవడంతో వరదనీరు వృథాగా సముద్రంలో కలిసిపోయిందన్నారు. దీంతో కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో చెరువులు నెర్రెలు వారుతున్నాయని ఆరోపించారు. చెరువుల్లో నీరులేకపోవడంతో పశువులకు సైతం ఈసారి నీటి సమస్య తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కళకళలాడిన చెరువులు నేడు ఎండిపోతున్నాయని, ఇందుకు నిదర్శనంగా స్థానిక పుంగమ్మ చెరువును పరిశీలించవచ్చని తెలిపారు. గత నాలుగేళ్లుగా నీటితో కళకళలాడిన పుంగమ్మ చెరువు నేడు ఎండిపోతోందన్నారు. పుంగనూరుకు నీటి సమస్య రావడం ఖాయమని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష ధోరణితో రైతు భరోసా లేకపోవడం, ఆర్బీకేల్లో ఎరువులు, మందులు లేక రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్న ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ 6 పథకాలు అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ముఖ్యంగా చంద్రబాబు ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన ఇంగ్లిషు భాషను విద్యార్థులకు దూరం చేస్తోందని మండిపడ్డారు. విద్యావ్యవస్థను పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పెంచేస్తోందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కసరత్తు తుదిదశకు..

- పరిశీలన చేస్తున్న విద్యాశాఖాధికారులు
- కసరత్తు ముగిసిన వెంటనే రాష్ట్ర విద్యాశాఖకు నివేదికలు
- త్వరలో సీనియారిటీ జాబితాలో అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖ కార్యాలయంలో 10 రోజులుగా తయారు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల టీచర్ల ఉద్యోగోన్నతుల జాబితా కసరత్తు తుదిదశకు చేరుకుంది. ఈ కసరత్తును పకడ్బందీగా నిర్వహించేలా డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో ఉన్న ప్రభుత్వ టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖాధికారులు జారీ చేసిన నిబంధనల ప్రకారం జాబితాలు సిద్ధం చేయనున్నారు. ఈ జాబితాల కసరత్తులో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ సిబ్బంది తలమునకలై ఉన్నారు. మంగళవారంతో కసరత్తు పూర్తి చేసి, రాష్ట విద్యాశాఖ అధికారుల వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాను అప్‌లోడ్ చేయనున్నారు.

ముమ్మరంగా సాగుతున్న డెస్క్ పరిశీలన

క్షేత్రస్థాయిలో మండలాల వారీగా సీనియారిటీ జాబితాలను ఎంఈఓలు సిద్ధం చేసి డీఈఓ కార్యాలయానికి పంపారు. ఆ జాబితాలను మరోమారు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డెస్క్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఏవైనా తప్పిదాలు ఉంటే సరిదిద్దుతున్నారు. ఈ కసరత్తు పూర్తి అయిన వెంటనే త్వరలో సీనియారిటీ జాబితాలను విడుదల చేయనున్నారు. ఆ జాబితాలో ఏవైనా పొరబాట్లు ఉన్నట్‌లెతై టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, సరిదిద్దుతారు. ఆ తర్వాత శాశ్వత సీనియారిటీ జాబితాలను అమలు చేసేలా చర్యలు చేపడతారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన సీనియారిటీ జాబితా

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన సీనియారిటీ జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 16,730 మంది ప్రభుత్వ టీచర్లున్నారు. వీరిలో ఎస్జీటీలు 8,295, స్కూల్ అసిస్టెంట్‌లు 8,435, ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ హెచ్‌ఎంలు 408 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నాటికి హెచ్‌ఎంలు, ఎస్జీటీల కసరత్తు పూర్తి చేశారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 2,400 మంది టీచర్ల జాబితాలను మంగళవారం రాత్రికి పూర్తి చేయనున్నారు.

పకడ్బందీగా కసరత్తు



సీనియారిటీ జాబితాల కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నాం. ఈ కసరత్తు పూర్తి అయిన వెంటనే రాష్ట్ర విద్యాశాఖాధికారులు సూచించిన వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తాం. అనంతరం సీనియారిటీ జాబితాలను విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరిస్తాం. అభ్యంతరాల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత తుది సీనియారిటీ జాబితాలను ప్రచురిస్తాం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు జిల్లా

మాజీ మంత్రి కృషి ఫలించింది.. తిరుపతి–తిరుత్తణి నాలుగు లేన్ల రహదారికి ఊపు వచ్చింది. దీంతో హైవే విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ జాతీయ రహదారి కొత్తరూపు సంతరించుకుంటోంది. ఈ మార్గంలోని పట్టణాలు, పల్లెల రూపురేఖలు మారనున్నాయి.

- ఎన్‌హెచ్ 205కి కొత్త రూపు
- వేగంగా విస్తరణ పనులు
- కొత్తగా ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు
- ఫలించిన మాజీ మంత్రి ఆర్కే రోజా వినతి

వేపగుంట సమీపంలో వేగంగా జరుగుతున్న మినీ బ్రిడ్జి పనులు



ఎక్స్‌ప్రెస్ హైవే

నగరి : తిరుపతి నుంచి తిరువళ్లూరు వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమిళనాడులోని తిరుత్తణి నుంచి నగరి మీదుగా పుత్తూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు 205 చెన్నై సెక్షన్ 716, 71 తిరుపతి–తిరుత్తణి నాలుగు లేన్లతో సరికొత్త జాతీయ రహదారి రూపుదిద్దుకుంటోంది. తిరుపతి నుంచి తిరువళ్లూరు వరకు రూ.864 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మించడానికి జాతీయ రహదారుల విభాగం అంచనా వేసింది. అందులో పుత్తూరు వరకు వచ్చిన విస్తరణ పనులు ఆగిపోయాయి. అప్పటికే ఏరియల్ సర్వే పూర్తి చేసి, భూములు సేకరించి నష్టపరిహారం చెల్లించే పనులు కూడా పూర్తయ్యాయి. ఈ దశలో కొన్నేళ్లపాటు ఆగిన పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి.

మాజీ మంత్రి చొరవతో పనుల్లో చలనం

మాజీ మంత్రి ఆర్కేరోజా చొరవతో ఆగిన జాతీయ రహదారి విస్తరణ పనుల్లో చలనం వచ్చింది. 2023 జూలై 12వ తేదీన తిరుమలకు విచ్చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కారిని కలిసిన మాజీ మంత్రి ఆగిన 205 జాతీయ రహదారితోపాటు పలు రోడ్ల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. హైవే 205



సాక్షి

జాతీయ రహదారిలో భద్రతా చర్యలు చేపట్టండి

2023లో కేంద్రమంత్రికి మాజీమంత్రి ఆర్కేరోజా రోడ్ల గురించి విన్నవించుకున్న వార్త కటింగ్

పుత్తూరు నుంచి తమిళనాడు సరిహద్దులోని తిరుత్తణికి వరకు రెండులైన్ల రోడ్డు మాత్రమే ఉందని, తిరుమలకు వచ్చే భక్తులు ఎక్కువగా ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారని, రోడ్డు బిజీగా ఉన్న కారణంగా ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందుతున్నందున ఈ రోడ్డును ఫోర్‌లైన్ రోడ్డుగా మార్చాలంటూ ఆయన్ని కోరారు. స్థానికంగా ఉండే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఈ పనులకు చలనం వచ్చింది. పనులు ప్రారంభించిన సమయంలో కేంద్రమంత్రి ఈ అంశాన్ని ట్విట్టర్ ద్వారా మాజీమంత్రికి తెలియజేశారు.

మారనున్న పట్టణాల రూపురేఖలు

రాష్ట్ర సరిహద్దు నుంచి పట్టణాలు, గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. ఈ మార్గంలో వీఎస్ఆర్ పేట జంక్షన్ వద్ద, వీకేఆర్ పురం వద్ద, కీళపట్టు ఆంజనేయ స్వామి ఆలయ సర్కిల్, ఓంశక్తి ఆలయ సర్కిల్, కొండచుట్టు మండపం సర్కిల్, ప్రభుత్వ ఆస్పత్రి సర్కిల్ వద్ద, కనంమిట్ట వద్ద, వేపగుంట క్రాస్‌ల వద్ద అండర్ పాస్ రోడ్లు నిర్మించనున్నారు. బైపాస్ మార్గంలో కుశస్థలినదిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దేశమ్మ దేవాలయ ఆర్చి సమీపం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. ఉయ్యాల కాలువ మద్ద, జీవీఆర్ కల్యాణ మండపం సమీపం , పరమేశ్వర మంగళం వద్ద మినీ బ్రిడ్జిలు, 60 ప్రాంతాల్లో కల్వర్టులు ఈ పనుల్లో భాగంగా నిర్మించనున్నారు. రోడ్డు నిర్మించే ప్రాంతాలన్నింటిలోను సర్వీసు రోడ్లు రానున్నాయి. అలాగే జాతీయ రహదారిలోని 19 ఆలయాలు, 4 మండపాలు, 3 శిలావిగ్రహాలు, ఒక ఆలయ ప్రవేశ ఆర్చిపై ఈ పనుల ప్రభావం పడనుంది. దీంతో పట్టణాలు, గ్రామాల రూపురేఖలు మారనున్నాయి.

రెండేళ్లలో పనులు పూర్తి

జాతీయ రహదారి నిర్మాణ పనులు రెండేళ్లలో పూర్తవుతాయి. ప్రస్తుతం మినీబ్రిడ్జిల వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ ప్రాంతాలు చదును చేయడం, కాలువలు నిర్మించే పనులు చేస్తున్నాం. జాతీయ రహదారి ప్రామాణికాల మేరకు పనుల చేపడతాం. రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తవుతుంది.

– రాజారావ్, పీఆర్వో, నేషనల్ హైవే.

ఎన్‌హెచ్ 205కి కొత్తరూపు

తిరుత్తణి నుంచి పుత్తూరు ఓవర్ బ్రిడ్జి వరకు 20.05 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డును కేంద్రం విస్తరిస్తోంది. గతంలో జాతీయ రహదారిగా గుర్తించినా, చాలా ఇరుకుగా ఉండి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుండడంతో విస్తరణ జరుగుతోంది. ఇప్పటి వరకు రెండు లేన్లు మాత్రమే ఉన్న ఈ రోడ్డు నాలుగు లేన్ల రోడ్డుగా మారుతోంది. 60 మీటర్లు మేరకు రోడ్డు వేయనున్నారు. జాతీయ రహదారి నిబంధనలు అనుసరించి డివైడర్, రోడ్డు పక్కనే వర్షపు నీరు ప్రవహించే కాలువలు, సర్వీసు రోడ్లతో పక్కాగా రహదారి నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే రోడ్డు నిర్మాణ స్థలాలు చదును చేయడంతో పాటు కల్వర్టులు, మినీ వంతెనల వద్ద విస్తరణ పనులు, కాలువల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.

దివ్యాంగులకు ఆన్‌లైన్‌లో పాసుల జారీ

చిత్తూరు కార్పొరేషన్: దివ్యాంగులకు రైల్వేశాఖ ఆన్‌లైన్‌లోనే పాసుల జారీ చేస్తోందని ఆశాఖ జిల్లా వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. ఈ విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారన్నారు. గతంలో నేరుగా వచ్చి స్టేషన్‌లో పాసులు కోసం దరఖాస్తు చేసి తీసుకునేవారన్నారు. ప్రస్తుతం దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ప్రభుత్వం రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఆన్‌లైన్‌లో http://divyangjanid.indianrail.gov.in వెబ్‌సైట్‌లో పాసులు, ఈ–టికెటు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

రైతు దీక్షలకు వివిధ సంఘాల మద్దతు



మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కుప్పంరూరల్: జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆవులనత్తం రైతులకు మంగళవారం వివిధ స్థానిక సంఘాల మద్దతు పలికాయి. ఉదయం ఎమ్మార్పీఎస్ నాయకులు, మధ్యాహ్నం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రైతుల నిరసనకు మద్దతు పలికారు. రైతులు న్యాయమైన సమస్యలపై పోరాటం చేస్తుంటే అధికారులు, నాయకులు, జెల్లి ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు తాము రైతులకు అండగా ఉంటామని చెప్పారు.

క్లుప్తంగా

ఫిర్యాదులో పేర్కొన్నవారిని అరెస్టు చేయండి


డీఎస్పీతో మాట్లాడుతున్న దళితులు

నగరి : ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తడుకు గొడవలో తాము ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వారిని అరెస్టు చేయాలని దళితనాయకులు డీఎస్పీ డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్‌కు విన్నవించుకున్నారు. ప్రతివాదులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వారిని వెంటాడి అరెస్టు చేస్తున్నారని, తాము ఇచ్చిన ఫిర్యాదులో ఉన్నవారిని మాత్రం అరెస్టు చేయడం లేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దళితనాయకుడు, వైస్ ఎంపీపీ కన్నియప్ప మాట్లాడుతూ తడుకులో దళితులకు, అగ్రవర్ణాల వారికి జరిగిన గొడవల్లో ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేశామని, తాము 16 మందిపై కేసులు పెడితే, వారు 12 మందిపై కేసులు పెట్టారన్నారు. తాము పెట్టిన కేసుకు సంబంధించి ఇద్దరిని మాత్రమే అరెస్టు చేశారని, వారు పెట్టిన కేసు ఆధారంగా ఏడుగురిని వెతికి మరీ అరెస్టు చేశారన్నారు. తాము ఫిర్యాదులో పేర్కొన్న వారు అధికార పార్టీ అండతో దర్జాగా తిరుగుతున్నారని అయినా వారిని అరెస్టు చేయడం లేదని ఆరోపించారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్


ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

నగరి : ఇసుక తరలింపుదారులకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, అధికారులు నిబంధనల గురించి వివరించి హెచ్చరిస్తున్నా ఇసుక తరలింపుదారులు వాటిని పెడచెవిన పెడుతున్నారు. రాత్రి పూట యథేచ్ఛగా ఇసుక తరలించడం మొదలుపెట్టారు. మంచుతెరలు వీడకముందే ఇసుక ట్రాక్టర్లు నీరు లేని ప్రాంతంలోను, నీళ్లు ఉన్న ప్రాంతంలోను ఇసుకను ట్రాక్టర్లలో నింపేసి తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు, గ్రామ యువకులు రాత్రుళ్లు నదిలో ఇసుక తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమయపాలన పాటించాలని, సొంత పనులకు తప్ప వ్యాపారం నిమిత్తం ఇసుక తరలించకూడదని పదేపదే చెబుతున్నా అవి ఇసుక తరలింపుదారుల చెవికెక్కడం లేదన్నారు. అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ వారిపని వారు కానిచేస్తున్నారంటున్నారు. సోషల్ మీడియా ద్వారా తరలింపు అంశం బయటకు రావడంతో కుశస్థలి నది వద్దకు చేరుకున్న పోలీసులు ఇసుక తరలింపు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు.

టెండర్ల ఆహ్వానం

చిత్తూరురూరల్ (కాణిపాకం): జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో షాపుల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ జగదీష్ తెలిపారు. మొత్తం 73 షాపులకు ఆసక్తి గల వారు ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం లోపు టెండర్లు దాఖలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు టెండర్‌దారుల సమక్షంలో టెండర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇందుకోసం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని డీపీటీఓ కార్యాలయంలో టెండర్ బాక్సు ఉంచామని ఆయన పేర్కొన్నారు.

పెళ్లి బాజా మోగింది!

'మాఘమాసం ఎప్పుడొస్తుందో..మౌన రాగాలెన్నినాళ్లో..' అని ఎదురుచూసే జంటలు కోరుకున్నట్టే మాఘ మాసం వచ్చింది. జిల్లా వ్యాప్తంగా వివాహ వేడుకలు జోరుగా సాగుతున్నాయి. వచ్చే మూడు నాలుగు నెలల్లో వేలాది వివాహాలు జరగనున్నాయి. ఇందుకు జిల్లాలోని ప్రముఖ కల్యాణ మండపాలు ముందుగానే బుక్ అయిపోయాయి. ఈ ఏడాది పెళ్లిళ్లు ఏస్థాయిలో జరగనున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లతోపాటు ప్రేమ వివాహాలూ మూహూర్తాలు పెట్టుకున్నవారు మూడు ముళ్లు వేసి, ఏడడుగులు నడవడానికి సిద్ధంగా ఉన్నారు.

- మంచి ముహూర్తం.. మాఘమాస ఘడియలు
- ప్రారంభమైన వివాహాలు
- ఊపందుకున్న అనుబంధ వ్యాపారాలు

బంగారుపాళెం/గుడిపాల: మాఘమాసం ప్రారంభం కావడంతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా భాజాభజంత్రీలు మోగుతున్నాయి. అవివాహితులు ఎదురుచూసే మాఘమాసం రానే వచ్చింది. దీంతో ఊరూ, వాడా పెళ్లి సందడి నెలకొంది. ఈ నెలలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనుండడంతో ఊళ్లన్నీ పెళ్లికళ సంతరించుకున్నాయి. వివాహాలు ఓ వైపు ఉండగా మరోవైపు నూతన గృహప్రవేశాలు, దుకాణాల ప్రారంభోత్సవాలు, స్వగృహ నిర్మాణాలకు భూమిపూజలు ఇలా పలు శుభ కార్యాలకు మహూర్తాలు ఉండడంతో, పురోహితులకు డిమాండ్ పెరిగింది. కొందరు తమ ఇళ్ల వద్ద వివాహాలు నిశ్చయించగా, అనేక మంది కళ్యాణ మండపాలకు అడ్వాన్స్ ఇచ్చి, బుక్ చేసుకుంటున్నారు. పెళ్లి అనుబంధ వ్యాపారాలైన భాజాభజంత్రీలు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, ఫ్లవర్ డెకరేషన్, పెళ్లి సామగ్రి షాపులు, లైటింగ్, మైక్‌సెట్, బంగారు ఆభరణాలు, వస్త్ర దుకాణాల వద్ద హడావుడి పెరిగింది. అతిథులకు రకరకాల వంటకాలు చేయడానికి ముందుగానే వంట మాస్టర్లను వెతుక్కునే పనిలో ఉన్నారు.


ముస్తాబు చేసిన కల్యాణ వేదిక

విందు.. పసందు



పెళ్లిళ్లకు విందులే ప్రధానం. భోజనాలు రుచి శుచిగా ఉండాలని, బంధుమిత్రుల్లో మాట రాకూడదని భావిస్తుంటారు. అందుకే ఎంత ఖర్చయినా వెనుకాడరు. సాయంత్రం స్నాక్స్ మొదలు..రాత్రి విందు.. తెల్లవారిన తరువాత ముహూర్తాలైతే ఉదయం టిఫిన్ వరకూ భోజనం సరఫరా చేసే కేటరింగ్ సంస్థలు చాలానే ఉన్నాయి. మెనూ ప్రకారం ధర వసూలు చేస్తారు. ప్లేటు ధర రూ.120 నుంచి రూ.350 ఉన్నాయి.

జిల్లాలో నెలవారీ వివాహాల వివరాలు

నెల	వివాహాల సంఖ్య
ఫిబ్రవరి	500 నుంచి 750
మార్చి	300 నుంచి 500
ఏప్రిల్	100 నుంచి 150
మే	50 నుంచి 150
జూన్	200 నుంచి 350

మంచి ముహూర్తాలివే..

ఫిబ్రవరి 2 నుంచి జూన్ 7 వరకూ మంచి ముహూర్తాలున్నామని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 మార్చిలో 1, 2, 3, 6, 7, 12 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. అలాగే ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21 తేదీలు, మేలో 1, 5, 6, 7, 15, 17, 18, జూన్‌లో 1, 2, 4, 7 తేదీలో మంచి మహూర్తాలు ఉన్నాయని వేద పండితులు చెబుతున్నారు.



మంగళ వాయిద్యాలకూ గిరాకీ

హిందూ సంప్రదాయంలో భాజాభజంత్రీలు లేనివే పెళ్లిళ్లు జరగవు. అందుకే మంగళ వాయిద్యాలకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. వధూవరులను సిద్ధం చేయడం మొదలు.. పెళ్లయ్యాక వారిని ఇంటికి తీసుకువచ్చేవరకు వీటి అవసరం ఉంటుంది. బ్యాండ్ మేళాలు ఒక్కొక్క కార్యక్రమానికి రూ.10 వేలకు పైగా తీసుకుంటున్నారు. కొందరు సంగీత విభావరులను నిర్వహిస్తున్నారు. ఇందుకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ కళాకారులు తీసుకుంటున్నారు.

పసిడి ధరపై ప్రభావం

మార్కెట్‌లో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. శుభమహూర్తాలు సమీపించడంతో బంగారంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది.రోజు రోజుకు పసిడి ధర పెరుగుతూ వస్తోంది. అలాగే పూల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి.

అనేక మందికి ఉపాధి

వివాహాలు, శుభకార్యాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులకు, డెకరేషన్, వాయిద్య కళాకారులకు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్లు, క్యాటరింగ్, బ్యూటీ పార్లర్ నిర్వాహకులు, ట్రావెల్స్ ఏజెన్సీలకు డిమాండ్ ఏర్పడింది. ముహూర్తాల సీజన్‌తో ఆయా వ్యాపార వర్గాల వారికి పని దొరికి, ఉపాధి లభిస్తోంది.

డ్రోన్ ఫొటోగ్రఫీ ప్రత్యేకత

ఫొటోగ్రఫీ, వీడియోలకు గిరాకీ పెరగడంతో డిమాండ్‌ను ఆధారంగా వీడియో గ్రాఫర్లు కొత్త పంథాలో ముందుకు వెళుతున్నారు. గగనతలం నుంచి అత్యంత నాణ్యతతో ఫొటోలు, వీడియోలు తీస్తుండడంతో డ్రోన్ ఫొటోగ్రఫీకి ఆదరణ పెరిగింది. ఒక్కో కార్యక్రమానికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు తీసుకుంటున్నారు. ప్రింటింగ్ ఖర్చులు అదనంగా చార్జి చేస్తారు.



మంచి ముహూర్తాలున్నాయి



ఈ నెలలో మంచి ముహూర్తాలున్నాయి. ప్రస్తుతం శుభకార్యాలు చేసేందుకు అనుకూలంగా ఉండడంతో, ఎక్కువ మంది వివాహాలు, గృహ ప్రవేశాలు, అక్షరాభ్యాసం తదితర శుభ కార్యాలు చేసుకుంటున్నారు.
– శ్రీనివాసశర్మ, ప్రముఖ పురోహితులు, మొగిలి

కొత్త వంటకాలపై దృష్టి



పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు రకరకాల వంటలతో భోజనప్రియులను మెప్పించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త వంటకాలను రుచి చూపించాలి. అందుకనుగుణంగా మేం సమాయత్తమవుతున్నాం. శాఖాహార భోజనాన్ని నాన్ వెజ్ తలపించేలా చేయడంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం. – హరి, వంటమాస్టర్, మొగిలి

అవకాశాలు బాగా ఉన్నాయి



గతంలో ఏ చిన్న ఫొటో తీయాలన్నా ఫొటోగ్రాఫర్ అవసరం ఉండేది. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ వచ్చిన తరువాత ఫొటోగ్రాఫర్‌కు పని తగ్గింది. మారుతున్న కాలానికి అనుగుణంగా డ్రోన్, డిజిటల్ ఫొటోషూట్‌తో అవకాశాలు పెరిగాయి. మాఘమాసంలో అవకాశాలు వస్తున్నాయి.
–చిట్టి, ఫొటోస్టుడియో యజమాని, బంగారుపాళెం

కూటమి పాలన..దివ్యాంగ వేదన

లేవలేని స్థితిలో కొందరు.. ఎక్కడి వచ్చామో అర్థం కాని అయోమయస్థితిలో మరికొందరు..గంటల తరబడి నిరీక్షించలేక నీరసించి సొమ్మసిల్లిన ఇంకొందరు..కుటుంబ సభ్యుల సాయంతో అష్టకష్టాలు పడుతూ పరీక్ష కేంద్రానికి చేరుకున్న కొందరు..ఇవన్నీ నగరి ఆస్పత్రిలో దివ్యాంగ నిర్ధారణ కేంద్రం వద్ద కనిపించిన దృశ్యాలు. పునఃపరిశీలన పేరుతో ఎవరో ఒకరిద్దరు అనర్హుల ఏరివేతకు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వ్యవహిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈప్రక్రియ దివ్యాంగుల పాలిట ఆశనిపాతంగా మారింది. వారి సహనానికి పరీక్ష పెడుతోంది.

- మళ్లీ పరీక్షల పేరుతో మానసిక క్షోభ
- నరకం చూస్తున్న దివ్యాంగులు
- కుటుంబాలతో నగరి ఆస్పత్రిలో అవస్థలు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు

కార్వేటినగరం: జిల్లా వ్యాప్తంగా మానసిక రోగులు, దివ్యాంగులకు మరోసారి వైద్యపరీక్షలు చేలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నగరి ఏరియా ఆస్పత్రికి వైద్యపరీక్షల కోసం సుమారు వేల మంది దివ్యాంగులు, మానసిక రోగులు పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నడవలేనివారు, అందులు, మానసిక రోగులు అక్కడికి చేరుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వారి అవస్థలను చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎన్నో కిలోమీటర్ల దూరం నుంచి వేలాది మంది మానసిక రోగులు, దివ్యాంగులు వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికి వచ్చారు. అంగవైకల్యంతో తీవ్రమనోవేదనకు గురవుతున్న తమను ఎక్స్‌రేలు, స్కానింగ్‌ల పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, బాధితులతోపాటు వారి కుటుంబ సభ్యులు వాపోయారు.

ఇది అన్యాయం



దివ్యాంగుడైన నేను గత ఏడేళ్లుగా పింఛన్ పొందుతున్నాను. నడవలేని పరిస్థితి, కుర్చీకే పరిమితమైన నాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దివ్యాంగ పింఛన్ అందించింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైద్యపరీక్షల పేరుతో నరకం చూపడం అన్యాయం. పరీక్షల కోసం సుమారు 30 కిలోమీటర్ల దూరం వ్యయప్రయాసాలతో వెళ్లి నరకాన్ని అనుభవించాను.
– రమీజ, చింతతోపు, కార్వేటినగరం మండలం

చాలా దారుణం



అన్నిపనులకు వెళుతూ అందరితో కలియ దిరుగుతున్న నాకు నాలుగేళ్ల నుంచి ఆకస్మికంగా కాళ్లు చచ్చుపడ్డాయి. దీంతో నడవలేని స్థితిలో ఉన్న నాకు గత ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. ప్రతి నెలా పింఛన్ సొమ్ముతో ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నాను. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్యపరీక్షల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం దారుణం.
– వజ్రవేలు, బిల్లుదొన్న, కార్వేటినగరం మండలం

సోషల్ మీడియా క్రైమ్‌పై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : సామాజిక మాధ్యమాలు వినియోగించే ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా క్రైమ్‌పై అప్రమత్తత అవసరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. సైబర్ మోసాలపై క్షేత్రస్థాయిలో అవగాహన నిమిత్తం మంగళవారం క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, యువత, పెద్దలు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్‌క్రైమ్‌తో జరిగే అనర్థాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ క్రైమ్‌పై టీచర్లు, ఎంఈఓలు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా ఉందన్నారు. దీంతో సైబర్‌క్రైమ్‌లు పెరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్‌ను అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకునేలా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రస్తుతం పార్ట్ టైమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్స్ అప్ గ్రూప్‌లో మెసేజ్‌లు పంపించడం, ఓటీపీ నేరాలు, క్యూఆర్ స్కాన్ ఉపయోగించి లావాదేవీల మోసాలు చేస్తున్నారన్నారు. బలమైన ఆర్థిక సైబర్ మోసాల యంత్రాంగాన్ని సృష్టించేందుకు ఎస్ఎంఎస్‌లు, టెలీగ్రామ్, వాట్సాప్, మొబైల్ యాప్‌లు చెల్లింపు గేట్‌వేలు మొదలైన వాటిని స్కామర్లు వినియోగిస్తున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుని చివరకు ఆత్మహత్యల వరకు పలువురు వెళ్లారన్నారు. తెలియని లింకులను నొక్కితే సెల్‌ఫోన్‌లోని పూర్తి వ్యక్తిగత సమాచారం స్కామర్ల చేతిలోకి వెళుతుందన్నారు. యువత ముఖ్యంగా లోన్‌యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

ప్రస్తుతం డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు సాగుతున్నాయని ఎస్పీ అన్నారు. ఇది ఎక్కువ ప్రచారంలో ఉందన్నారు. ఇటువంటి వాటిని ప్రజలు నమ్మకూడదన్నారు. ఎటువంటి ఇంటరాగేషన్ ఉన్నా ఫిజికల్‌గా అధికారులు వస్తారన్నారు. ఇటువంటి సమస్యలు ఎదురైన వారు వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, డీఎస్పీలు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పురిటిబిడ్డ మృతిపై హైడ్రామా

చిత్తూరు అర్బన్: నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో ఓ పురిటిబిడ్డ మృతి చెందడంలో పసికందులను విక్రయించే ముఠా ఉందని ప్రచారం జరగడంతో హైడ్రామా నెలకొంది. తమిళనాడులోని కాట్పాడికి చెందిన ఓ నిండు చూలాలు చిత్తూరు నగరంలోని సంతపేటలో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చింది. మంగళవారం పురిటినొప్పులు రావడంతో పక్కనే ఉన్న ఓ నర్సును పిలవడంతో ఆమె ప్రసవం చేయించారు. అప్పటికే బిడ్డ ఉమ్మనీరు తాగడంతో.. నవజాత శిశువును చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పసికందు మృతి చెందింది. అయితే తిరుపతికి చెందిన ఓ జంట తమకు పిల్లలు లేకపోవడంతో, ఓ బిడ్డను దత్తత తీసుకునే ప్రయత్నంలో కాట్పాడికి చెందిన మహిళతో కొందరు పరిచయం చేశారు. పుట్టబోయే బిడ్డ తనకు వద్దని కాట్పాడికి చెందిన మహిళ చెప్పడంతో, తిరుపతికి చెందిన జంట ఆ బిడ్డను తీసుకోవడానికి ముందుకు వచ్చారు. ఆస్పత్రిలో బిడ్డ చనిపోవడంతో, నెపం ఎవరిపైకి వస్తుందో తెలియక ఎవరిదారిన వారు అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. మృతశిశువును వదిలి అందరూ వెళ్లిపోతుండడంతో ఆస్పత్రి సిబ్బందికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న టూటౌన్ పోలీసులు దీని వెనుక బిడ్డను అపహరించే ముఠా ఏదైనా ఉందా..? దత్తత ఇవ్వడానికి ఎవరిని సంప్రదించారు..? అనే వివరాలు రాబడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీల నమోదు వేగవంతం చేయండి


సమీక్షిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: పీఎం సూర్యఘర్‌ను ఎస్సీ ఎస్టీలకు అందించడానికి చేస్తున్న నమోదు వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు 2 కిలోవాట్ల సోలార్ పలకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. తద్వారా వారికి విద్యుత్ సరఫరాను ఇవ్వనున్నారన్నారు. ఇప్పటివరకు 70 శాతం నమోదు జరిగిందన్నారు. మార్చి తర్వాత వీటిని క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లకు తగిన కండక్టర్లు ఏర్పాటు చేసుకునేలా వాణిజ్య సర్వీసుదారులకు లైన్‌ఇన్‌స్పెక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. పలు చోట్ల వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. బిల్లులు వందశాతం వసూలు చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, కొండయ్య, ఏఈ, సబ్‌ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం కాల్చేశారు!

పుంగనూరు: పట్టణంలోని రాంనగర్‌కాలనీలో నివాసం ఉన్న నరేష్‌కు చెందిన ద్విచక్రవాహనాన్ని ఎవరో కాల్చివేశారని బాధితుడు నరేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి ఇంటి వద్ద ఆపి ఉంచిన వాహనాన్ని అర్ధరాత్రి ఎవరో కాల్చివేయడంతో వెంటనే గమనించి మంటలు ఆర్పివేశామన్నారు. దీనిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విరిసిరిగా..!

ఆయనో నిరక్షరాస్యుడు.. సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి.. ఆయనకున్నది 1.5 ఎకరాల గ్రీన్‌హౌస్.. 20 ఏళ్ల ప్రాయం నుంచే కాగడ, కనకాంబరం, బంతి, చామంతి సాగు చేసి, నష్టాల పాలయ్యాడు. అయితే పూలసాగుపైనే మనస్సు పడిన ఆయన సాగు మార్చాడు.. రోజా పూల సాగు చేశాడు.. విదేశాలకు ఎగుమతి చేశాడు.. ఒకటి కాదు..రెండు కాదు.. సుమారు పది రకాల రోజా పూలు సాగులో పట్టు సాధించి.. సిరుల పంట పండిస్తున్నాడు.. ఆయనే కొత్తయిండ్లు గ్రామానికి చెందిన మదన్‌కుమార్.

- పూల సాగులో 42 ఏళ్ల అనుభవం
- దశాబ్ద కాలంగా రోజా పూలసాగు
- ఎగుమతికి కర్ణాటక వెళ్లి తీరాల్సిందే

మదన్‌కుమార్ గ్రీన్‌హౌస్‌లో సాగవుతున్న రోజా పూల తోట



కుప్పంరూరల్: మండలంలోని కొత్తయిండ్లు గ్రామానికి చెందిన ఎస్. మదన్‌కుమార్‌కు పూల సాగును వ్యసనంగా మార్చుకున్నాడు. 62 ఏళ్లు వచ్చినా మదన్‌కుమార్‌కు పూల సాగుపై ఉన్న మమకారం తీరలేదు. 20 ఏళ్ల వయస్సు నుంచే కాగడ, కనకాంబరం, బంతి, చామంతి తదితర పూల సాగు మొదలు పెట్టాడు. అప్పట్లో అతడు సాగు చేసిన పూలను ముంబయి, మద్రాసు, విజయవాడ, బెంగళూరు నగరాలకు ఎగుమతి చేసేవాడు. మారుతున్న కాలానుగుణంగా మదన్‌కుమార్ 2014లో రోజా సాగుపై మనస్సు పడ్డాడు. మొదట్లో దక్షిణ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలతోపాటు దేశంలోని ప్రధాన నగరాలకు ఎగుమతి చేసేవాడు. ప్రభుత్వాల నుంచి సహకారం కొరవడడంతో పూలను మార్కెట్‌కు తరలించాలంటే కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు వెళ్లి రావాల్సి వస్తోంది.


రవాణాకు సిద్ధం చేసిన రోజా పూలు

నెలకు రూ.లక్ష లాభం

2014లో రోజా సాగు వైపు మళ్లిన మదన్‌కుమార్ అప్పటి నుంచి తిరిగి చూడలేదు. రోజాల్లో మేలిమి రకాలైన తాజ్‌మహల్, అవలంచి, గోల్డ్‌స్టిక్, నోబ్‌లెస్, కార్వేటి, రాక్‌స్టార్, జుంబ్లీ వంటి రకాలను సాగు చేస్తున్నాడు కర్ణాటక రాష్ట్రం సజ్జాపూర్, ఆ గులకోట నుంచి ఒక్కో మొక్క రకాన్ని బట్టి రూ.25కు తెచ్చి తన కున్న 1.5 ఎకరాల గ్రీన్‌హౌస్‌లో సాగు చేస్తున్నాడు. సాగుకు రూ.లక్ష ఖర్చు అవుతుండగా, రూ.2 లక్షల ఆదాయం వస్తోందని మదన్‌కుమార్ తెలిపాడు.

ఎగుమతికి ముళబాగిల్‌కు వెళ్లాల్సిందే

మొదట్లో ప్రభుత్వ సహకారంతో రోజాలను దక్షిణ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలకు ఎగుమతి చేసేవారు. ప్రభుత్వాల ప్రోత్సాహం కరువవ్వడంతో ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి రవాణా సదుపాయం లేక కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు వెళ్లి రావాల్సి వస్తోంది. విదేశీయుల పరిచయాలతో అప్పుడప్పుడు పర్వదినాలకు విదేశీ వ్యాపారులే స్వయంగా మదన్‌కుమార్ వద్దకు వచ్చి రోజా పూల బంచ్ (12 పూల మొత్తం) కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బంచ్‌ను రూ.300 నుంచి రూ.400 ఇచ్చి కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. దీంతో కుప్పం మండలంలో రోజా పూల మదన్ అంటే ఇట్టే గుర్తు పట్టేస్తారు.

మరో 10 మంది మహిళలకు ఉపాధి..

120 రోజులకు కోత ప్రారంభమయ్యే రోజాలు పూర్తిస్థాయి కటింగ్ 160 రోజుల నుంచి ప్రారంభమవుతుంది. రోజు మార్చి రోజు కటింగ్ చేయాల్సి ఉంటుంది. రోజాల కటింగ్, బంచ్‌ల తయారీ, గ్రేడింగ్, కోల్డ్ స్టోరేజీ నిల్వల కోసం నిత్యం 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాడు.

2014లో రోజా పూల సాగుకు శ్రీకారం



నాకు మొదటి నుంచి పూల సాగంటే మహా ఇష్టం. నేను 42 ఏళ్లుగా పూల సాగు చేస్తున్నాను. మొదట్లో కాగడ, కనకాంబరం, బంతి, చామంతి సాగు చేపట్టేవాడిని. కొన్నిసార్లు మార్కెట్ ఒడిదుడుకులతో నష్టం వచ్చేది. దీంతో నేను 2014లో ఎప్పటి నుంచో సాగు చేయాలనుకున్న రోజా సాగుకు శ్రీకారం చుట్టాను. కర్ణాటక రాష్ట్రం సజ్జాపూర్, ఆలంకోట నుంచి మొక్కలు తెచ్చి సాగు చేశాను. ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు ఎగుమతి చేశాను. దీంతో నాకు నెలకు రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేది. ఒక్కో స్టెమ్ (ఒక్క రోజా) రూ.32 ప్రస్తుతం మార్కెట్ విలువ ఉంది. ఇంత ధర పెట్టి సిటీ జనాలే కొంటారు. అందుకు నేను ముంబయి, చెన్నై, విజయవాడకు పూలను పంపాల్సి ఉంటుంది. నేరుగా రవాణా సదుపాయం లేకపోవడంతో రోజు మార్చి రోజు ముళబాగిల్‌కు వెళ్లి రావాల్సి వస్తోంది. ప్రస్తుతం సహకరిస్తే మరిన్ని రకాల రోజాలను తయారు చేయాలన్న ఆలోచన ఉంది.
– మదన్‌కుమార్, రైతు, కొత్తయిండు